క్లుప్తంగా

పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

ఎంఈఓ వేముల నాగయ్య



మాచర్ల: ప్రతి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఏడాది పాటు చేపట్టాల్సిన ప్రణాళికకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంఈఓ వేముల నాగయ్య ఆయా పాఠశాలల హెచ్ఎంలను కోరారు. మంగళవారం స్థానిక జెడ్పీ హెచ్ఎస్ బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలలకు సంబంధించి ప్రణాళికబద్ధంగా చేయాల్సిన పనులకు సంబంధించి పూర్తి వివరాలను అందజేయాలని ఎంఈఓ కోరారు. ఈ సమావేశంలో ప్రభుత్వ, ఎయిడెడ్ హెచ్ఎంలు పాల్గొన్నారు.

దాచేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కలకండ



గురజాల : దాచేపల్లి-గురజాల మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా కలకండ అంద్రెయ్యను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్ చైర్మన్‌గా తగుళ్ల పెద్ద పిచ్చయ్యను మరో 18 మంది కమిటీ సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కె అంద్రెయ్య మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన ప్రతి ఒక్క హామీని సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నెరవేర్చుతున్నారని అదే విధంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయులు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ టీజీవి కృష్ణారెడ్డి, నియోజకవర్గ స్థాయి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ



మాచర్ల: పట్టణంలోని అనాధలు, వృద్ధులకు మంగళవారం అల్లం రామిరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 30 మంది అనాథ వృద్ధులకు శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి వారి దేవాలయం, బస్టాండ్, రైల్వేస్టేషన్, రింగురోడ్డు పలు ప్రాంతాల్లో ట్రస్టు అధ్యక్షులు, నిర్వాహకులు అల్లం కోటిరెడ్డి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలువురు పేదలకు సేవలు చేసేందుకు స్వర్గీయ అల్లం రామిరెడ్డి పేరుతో ట్రస్టు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షులు ఓరుగంటి చెన్నకేశవరావు, చుండూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ జయశ్రీ

దాచేపల్లి : ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు చేయాలని ఎంపీపీ కటకం జయశ్రీ బ్రహ్మానాయుడు అన్నారు. మండలంలోని పెదగార్లపాడు, కేసానుపల్లి, తక్కెళ్లపాడు వలంటీర్లు, సచివాలయం కన్వీనర్ల సమావేశం సచివాలయాల్లో మంగళవారం జరిగింది. వలంటీర్లు, కన్వీనర్లు సమష్టిగా పనిచేయాలని, పింఛన్లు, ప్రభుత్వ పథకాలు సక్రమంగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అన్నారు. పథకాల అమలులో నిర్లక్ష్యం వహించవద్దని, ప్రభుత్వం పట్ల ప్రజలకు నమ్మకం కలిగేలా పనిచేయాలన్నారు. కన్వీనర్లు, వలంటీర్ల దృష్టికి వచ్చిన సమస్యలను మండల స్థాయి అధికారులకు చెప్పి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి అన్నారు. సమావేశంలో ఎంపీడీఓ వై. మహాలక్ష్మి, సర్పంచ్‌లు వినుకొండ కోటేశ్వరరావు, కటికాల వరలక్ష్మి, పుప్పాల శివ, ఉపసర్పంచ్ కర్పూరపు వెంకటకోటయ్య, ఎంపీటీసీ చెట్టిపోగు ఏసుదాసు, జంగిలి నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో, ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీ

మాచవరం: మలుపు తిరుగుతున్న ఆటోని, ప్రైవేటు స్కూల్ బస్సు ఢీ కొన్న ఘటన మండలంలోని గంగిరెడ్డిపాలెం మసీద్ సెంటర్ మూల మలుపు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పిడుగురాళ్లకు చెందిన ఓ ప్రైవేటు స్కూల్ బస్సు విద్యార్థులను ఎక్కించుకుని బ్రాహ్మణపల్లి వైపు వెళ్తుండగా, మాచవరం గ్రామానికి చెందిన ఆటోని ఢీ కొట్టింది. ఘటనలో ఆటో డ్రైవర్ అంజికి స్వల్ప గాయాలయ్యాయి. గాయాలయిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం పిడుగురాళ్ల ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మూడో విడత జగనన్న కాలనీలు పూర్తి చేయాలి

- అధికారులంతా సమష్టిగా కృషి చేయాలి
- లబ్ధిదారులకు ప్రయోజనం కలిగించే విధంగా చర్యలు తీసుకోండి
- సమీక్ష సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీఆర్కే



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: పట్టణంలో ఇళ్ళ స్థలం ఇచ్చిన ప్రతి లబ్ధిదారుడికి జగనన్న కాలనీలలో ఇళ్ళు కట్టాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహించకుండా మూడవ విడత ఇళ్ళ నిర్మాణ పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం పురపాలక సంఘ కార్యాలయంలో నియోజక వర్గ హౌసింగ్ అధికారులు, సచివాలయ అడ్మిన్‌లుతో పాటు ఆయా శాఖాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి సచివాలయ పరిధిలో మంజూరైన ఇళ్ళ నిర్మాణం పూర్తి చేసే విషయమై పూర్తిస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ లే అవుట్ల ప్రకారం మూడవ విడత ఎంత మంది నిర్మించుకోవాల్సి ఉంది, ఎంత మంది ఆసక్తి చూపుతున్నారు అనే అంశాల పై ఆయన సమీక్షించారు. హౌసింగ్ శాఖ డీఈ, ఏఈతో పాటు పురపాలక సంఘ కమిషనర్ రమణబాబు, సచివాలయ అడ్మిన్లుతో పాటు పలువురుతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎక్కడా రాజీ పడకుండా వెంటనే జగనన్న కాలనీలో ఇళ్ళ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు సమష్టిగా హౌసింగ్, సచివాలయాల వారు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, కమిషనర్ ఈవి రమణబాబుతో పాటు జగనన్న కాలనీల కాంట్రాక్టర్లు, ఆయా శాఖాధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయం



క్రికెట్ ఆడి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: సంక్రాంతి పండుగ సందర్భంగా యువకులు, విద్యార్థులు, క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం ఎంతో అభినందనీయమని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ యూత్ ఆధ్వర్యంలో నియోజక వర్గ క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం ప్రారంభించి క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. తెలుగు సాంప్రదాయాలు ప్రోత్సహిస్తూ వైఎస్సార్ సీపీ యూత్ క్రీడలను ప్రోత్సహించడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ పోటీలకు బహుమతులు అందించే ప్రథమ బహుమతిని వేముల దుర్గ రూ. 12016, ద్వితీయ బహుమతిని కంభంపాటి అనిల్‌కుమార్ రూ. 8016, తృతీయ బహుమతిని వేముల దుర్గ రూ. 3016, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ టౌన్ ముస్లిం యూత్ రూ. 1116లు అందజేసే వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాజీ చైర్మన్ తురక కిషోర్, నిర్వాహకులు వేముల దుర్గ, ఆయా వార్డు కౌన్సిలర్లు, చంద్రకుమార్, మందా సంతోష్, షేక్ కరిముల్లా, మస్తాన్, చందూ గౌడ్, సుభాని, శంకర్, టోర్నమెంట్ నిర్వాహకులు సాయి, ఎం జాన్‌సాహెబ్, చిన్ని, వడ్డెర సంఘ, మైనార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు. టోర్నమెంట్ ప్రారంభానికి ముందు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర నాలుగేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ నాయకులు, క్రికెట్ క్రీడాకారుల ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అదే విధంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రోడ్డు మరమ్మతు పనులు



కారెంపూడి: ఆర్అండ్‌బీ శాఖ కారెంపూడిలో ప్రధాన రహదారి మరమ్మతు పనులు చేపట్టింది. గత రెండు రోజులుగా గుంతలు పడిన చోట వాటిని పూడ్చి బీటీ లేయర్ వేసి రోలర్ తిప్పుతున్నారు. బస్టాండ్ సెంటర్ నుంచి పాత బ్యాంక్ సెంటర్ వరకు మరమ్మతు పనులు మంగళవారం నాటికి పూర్తయ్యాయి. గ్రామ బయట నర్సరావుపేట, మాచర్ల, వినుకొండ, దాచేపల్లి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారుల పునర్నిర్మాణం గతంలోనే జరిగాయి. కాని అప్పట్లో గ్రామంలో ఉన్న రోడ్డు మాత్రం వేయకపోవడంతో వర్షానికి బాగా గుంతలు పడి అధ్వానంగా తయారైంది. ఈ నేపథ్యంలో రోడ్డు బాగు పనులను ఆర్అండ్‌బీ అధికారులు ప్రస్తుతం చేయిస్తున్నారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తాం



స్విచ్ఆన్ చేసి తాగునీటిని సరఫరా చేస్తున్న నాయకులు

దాచేపల్లి : తంగెడ ప్రజలకు స్వచ్ఛమైన కృష్ణానది నీటిని అందిస్తామని జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్ రెడ్డి అన్నారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయంలో తంగెడలో సురక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో సుమారుగా 8 లక్షల వ్యయంతో పథకాన్ని సంబంధించిన ట్యాంకులను శుభ్రం చేసి నీటిని ఫిల్టర్ చేసే సంపులలో ఇసుక, కంకరను మార్చారు. ఈ పనులు పూర్తి కావడంతో జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి స్విచ్ఆన్ చేసి తాగునీటిని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ..మహానేత చొరవతో తంగెడ ప్రజలకు కృష్ణానది నీటిని అందించగలుగుతున్నామని, గత ప్రభుత్వం ఈ పథకాల పర్యవేక్షణ పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రతి రోజు తంగెడ ప్రజలకు కృష్ణానది నుంచి తాగునీరు సరఫరా చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కందుల జాను, సర్పంచ్‌లు దైద నాగరాజు, కొత్తపల్లి కాశయ్య, ఎంపీటీసీ పోతుల కమలకుమారి, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర రత్నం, కో ఆప్షన్ సభ్యుడు షేక్ హంస్సేన్, నాయకులు దేవళ్ల వీరాస్వామి, బీరవల్లి శౌరైడ్డి, అరికట్ల మల్లారెడ్డి, కాసర్ల నరసింహరెడ్డి, కొత్తపల్లి యోహాను, ఉప్పుతల నరసింహరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

సూపర్‌వైజర్ రత్నకుమారి



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న సూపర్ వైజర్

గురజాల : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు ద్వారా ఆరోగ్యవంతమైన ఆహారం అందించే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందని సూపర్‌వైజర్ వై రత్నకుమారి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం బాలింతలకు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లును సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాటి ద్వారా బలవర్ధకమైన ఆహారం లభిస్తుందన్నారు. బాలింతలు, గర్భవతులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించే విధంగా అంగన్‌వాడీల్లో పలు సంస్కరణలు తీసుకురావడం జరిగిందన్నారు. ముఖ్యంగా రక్తహీనత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు జక్కా ఉమా , రాణీ తదితరులున్నారు.

పల్నాటి చెన్నకేశవుని తులసి మాల



తులసి మాల కడుతున్న భక్తులు

కారెంపూడి: ధర్మాన పూజల్లో భాగంగా బుధవారం జరగనున్న గోదాదేవి అమ్మవారి కుడారి ఉత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లలో మహిళా భక్తులు మంగళవారం రాత్రి అత్యంత భక్తి ప్రపత్తులతో పాల్గొన్నారు. స్వామి వారికి 50 కిలోల భారీ తులసి మాల తయారీలో వారు పాలుపంచుకున్నారు. పల్నాడులో చెన్నకేశవస్వామి మణిహారంగా స్వామితో ముడిపడి ఉన్న పల్నాటి ఉత్సవాల్లో తులసి మాలలకు ఎనలేని ప్రాధాన్యత ఉంది. పల్నాడు చరిత్రలో సైతం ఇది ప్రస్ఫుటంగా కన్పిస్తోంది. నాటి నుంచి స్వామి వారి సేవలో తులసీ దళం ప్రాధాన్యత మనకు కన్పిస్తోంది. పల్నాటి చరిత్రలో సైతం తులసీ దళ అద్భుతాలు బ్రహ్మనాయుడు రూపంలో చరిత్రలో మనకు కన్పిస్తాయి.

సంక్రాంతి సందర్భంగా ఆటల పోటీలు

పిడుగురాళ్ల: పట్టణంలోని కేఎస్ఆర్ విద్యా సంస్థల్లో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని బాలబాలికలకు మంగళవారం ఆటల పోటీలను నిర్వహించారు. బాలబాలికలకు కబ్బడీ, కోకో వంటి ఆటల పోటీలు నిర్వహించారు. అదేవిధంగా బుధవారం నాడు మహిళలకు ముగ్గుల పోటీలు, బాలురకు క్రికెట్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని కళాశాల డైరెక్టర్లు కొనేటి నరసింహారావు, బాడిశ మస్తాన్‌రావులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక ఉల్లాసాన్ని, నైపుణ్యాన్ని పెంపొందించుటకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. గెలుపొందిన విద్యార్థులు బహుమతులను అందజేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు వేస్తే చర్యలు తప్పవు

సీఐ జయకుమార్

కారెంపూడి: సంక్రాంతి పండుగ సాకుతో ఎవరైనా నిషిద్ధ కోడిపందేలు, పేకాట లాంటి జూదాలకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కారెంపూడి సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ దార్ల జయకుమార్, ఎస్ఐ రామాంజనేయులు మంగళవారం హెచ్చరించారు. పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ జయరాంప్రసాద్ సూచనలతో ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీస్ నిఘా ఉందామన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి కోడిపందేలకు దిగి శాంతియుత వాతావరణానికి భంగం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ జయకుమార్ హెచ్చరించారు. అలాగే ప్రజలు కూడా పోలీస్‌శాఖకు సహకరించి అలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారి వివరాలను పోలీసులకు అందించాలని సీఐ కోరారు.

నేడు చెన్నకేశవాలయంలో అన్నదానం

కారెంపూడి: శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో బుధవారం మహాన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఆలయ అర్చకులు కొమండూరి సత్యనారాయణాచార్యులు తెలిపారు. భక్తుల సహకారంతో సుమారు 3 వేల మందికి అన్నదాన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నెలరోజుల పాటు జరుగుతున్న ధనుర్మాస పూజల్లో భాగంగా బుధవారం కుడారై ఉత్సవం జరుగుతుందని భారీ తులసి మాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు.

తీగ టమాటా పంటతో అధిక దిగుబడులు



రాజుపాలెం: మండలంలో రైతులు పెద్ద మొత్తంలో టమాటా పంటను సాగు చేస్తున్నారని ఉద్యాన అధికారి డి.నవీన్ కుమార్ తెలిపారు. మండలంలోని రాజుపాలెంలో తీగసాగు పద్ధతిలో పండిస్తున్న టమాటా పంటను ఉద్యాన అధికారి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా టమాటా పంట సాగు చేస్తున్న రైతు చొక్కా శ్రీనివాసరావుకు సూచనలు, సలహాలను ఇచ్చారు. దీని వల్ల పంట దిగుబడి పెరుగుతుందని, ఎక్కువ కాలం కాపు కాస్తుందని తెలిపారు. ఈ విధానంలో పంట సాగు చేయడం వల్ల ఎకరాకు రూ.80 వేలు ఖర్చు అవుతుందని కానీ దిగుబడి మూడు రెట్లు అవుతుందని తెలిపారు. నేలపై సాగు చేయడం ద్వారా సూర్యరశ్మి ఒకవైపే పడుతుందని, కాపు కూడా ఒకవైపే కాస్తుందని తెలిపారు. తెగుళ్ల సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రతీ రైతు తీగ పద్ధతిలోనే టమాటాను సాగు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా చతుర్థి మహోత్సవాలు

అచ్చంపేట: పవిత్ర కృష్ణానది ఒడ్డున గల దామర్ల గ్రామంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో సంకటహర చతుర్థి మహోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. 108వ సంకటహర చతుర్థి మహోత్సవాలు జరుపుకుంటున్నట్లు ఆలయ నిర్వాహకులు ఉప్పల శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహం నుంచి పవిత్ర కృష్ణానదీ జలాలను అష్టోత్తర శత కలశాలతో మహిళలు శోభాయాత్రగా.. మంగళ వాయిద్యాల మధ్య తీసుకొచ్చారు. కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. భజన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం స్వామివారికి అష్టోత్తర శతకలశాభిషేకాలు నిర్వహించారు. వేద పండితులు మహా స్నపన, విశేష పుష్పార్చన, అష్టోత్తర శత సంఖ్య గణపత్య థర్వశీర్ష హోమం నిర్వహించారు. మహా పూర్ణాహుతి, మహా నివేదన, పంచ హారతులు, నీరాజన కార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు

అమరావతి: అమరావతి అమరేశ్వరాలయంలోని వినాయకునికి మంగళవారం సంకటహర చతుర్థి పూజలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు జగర్లమూడి సాయి స్వామి వారికి వేకువ జామున మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన

వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి



భైరవునిపాడు గ్రామంలో నూతన సర్పంచ్ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్న పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి

మాచర్ల రూరల్: అన్నీ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా అట్టడుగు వర్గాల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న నవరత్నాలను ప్రతి ఒక్కరికీ అందేలా ప్రజలతో స్థానిక ప్రజా ప్రతినిధులు మమేకం కావాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని భైరవునిపాడు గ్రామంలో నూతన సర్పంచ్ పదవీ ప్రమాణ స్వీకారమహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా భావిస్తూ జగనన్న పరిపాలన సాగిస్తున్నాడని ఆయన పథకాలు అర్హతే ప్రమాణంగా అందరికీ అందిస్తున్నారని, ఇలాంటి సంక్షేమ రాజ్యం కోసం ప్రతి కార్యకర్త, నాయకులు ప్రజలతో మమేకమై పథకాల తీరు తెన్నులను తెలుసుకుని అందరికీ అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షులు పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, నూతన సర్పంచ్ పందరబోయిన చినమల్లయ్య (పూర్ణయ్య), సర్పంచ్ ఓరుగంటి చిన్న, నాయకులు జింకల వెంకటేశ్వర్లు, పందరబోయిన కొండ, బోయ మల్లారెడ్డి, బోయ వీరారెడ్డి, గోగిరెడ్డి అంజిరెడ్డి, గంటా నాగిరెడ్డి, కొండపు సైదారెడ్డి, తియగూర మట్టారెడ్డి, పున్నారెడ్డి, యార్డు డైరెక్టర్ పెరుమాళ్ళ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

యరపతినేని అనుచరుడికి రిమాండ్ బెయిలు మంజూరు

పిడుగురాళ్ల: టీడీపీ మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అనుచరులు దియ్యా రామకృష్ణ, ఇంతియాజ్‌లకు రిమాండ్‌కు తరలించారు. అయితే రిమాండ్ విధించిన వీరిద్దరికి పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. సోషల్ మీడియాలో దియ్యా రామకృష్ణ, ఇంతియాజ్‌ల దాడికి సంబంధించి తాము ఎటువంటి కేసు పెట్టలేదని చింతలపూడి చారిట్రబుల్ ట్రస్టు, పల్నాడు హాస్పటల్ వైద్యులు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ వీడియో విడుదల చేయడంతో కోర్టు రిమాండ్‌ను తొలగించి బెయిల్ మంజూరు చేసినట్లు తెలిసింది. ఇది ఇలా ఉండగా చింతలపూడి చారిట్రబుల్ ట్రస్టు, పల్నాడు హాస్పటల్ డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ మాత్రం గొడవ జరిగిన మాట వాస్తవమే, చింతలపూడి బాబుపై జరిగిన దాడి వాస్తవమేనని, రాజకీయ లబ్ధి కోసం కొందరు ఈ విషయాన్ని వాడుకుంటున్నారని, తాము కేసు పెట్టలేదని దీనిని కొంత మంది రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారని యరపతినేని అనుచరులు అరెస్టుకు తమకు సంబంధం లేదని సోషల్ మీడియాలో మంగళవారం వీడియోను విడుదల చేశారు. డిసెంబర్ 31 జరిగిన సంఘటనపై తాము ఎలాంటి కేసును నమోదు చేయలేదన్నారు. దియ్యా రామకృష్ణ తమకు దూరపు బంధువు అని, తమ మధ్య ఉన్న వివాదాలను తామే కూర్చొని మాట్లాడి పరిష్కరించుకుంటామని పేర్కొన్నారు. కొంత మంది స్వార్థ పరులు తాము రాజకీయంగా ముందుకు వెళ్తుంటే భయపడుతున్నారని, వారి కుట్రల్లో భాగమే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఈసందర్భంగా డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ సోషల్ మీడియాలో విడుదల చేసిన వీడియోలో తెలిపారు.

తెగుళ్ల నివారణకు సూచనలు పాటించాలి



మిర్చి రైతులకు సూచనలందిస్తున్న హార్టికల్చర్ అధికారి సురేష్, రైతులు

మాచర్ల రూరల్: రైతన్నలు మిర్చి పంటలో వస్తున్న నల్ల తామర పురుగు నివారణకు హార్టికల్చర్ శాఖాధికారుల సూచనలు, సలహాలు పాటించాలని హార్టికల్చర్ శాఖాధికారి ఎస్ సురేష్ కోరారు. మంగళవారం మండలంలోని రాయవరంలో తోటబడి శిక్షణ కార్యక్రమంలో మిర్చి రైతులతో ఆయన మాట్లాడారు. నల్ల తామర పురుగు నివారణకు యకరాకు 200 కేజీల వేపపిండిని భూమిలో వేయాలని, దీని వల్ల పురుగు యొక్క కోశస్థ దశలను నియంత్రించవచ్చునన్నారు. అంతేకాకుండా పురుగుమందులను పిచికారీ చేసేటప్పుడు వాటితో పాటు 10 వేల పిపిఎం వేపనూనెను ఒక లీటర్‌కు 2ఎంఎల్ చొప్పున కలుపుకుని పిచికారీ చేయాలన్నారు. నత్రజని అధిక మొత్తంలో వాడకూడదని కోరారు. పసుపురంగు, నీలిరంగు, జిగురు అట్టలను యకరాకు 50 నుంచి 60 చొప్పున ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అసీటామా ప్రిడ్ 2గ్రా, లేక థయోమిథ్యాక్సామ్ 0.5గ్రా, లేక స్పైరో మెసిఫెన్ 1ఎంఎల్ చొప్పున నీటితో పిచికారి చేయాలన్నారు. మొక్కల్లో సూక్ష్మలోపం ఉన్నట్లయితే ప్రతి 20 రోజులకొకసారి ఫార్ములా 6ను 5గ్రా. నీటికి చొప్పున పిచికారీ చేయాలన్నారు. బొబ్బర తెగులు ఆశించిన పొలాలలో పీకి కాల్చి కాల్చివేయాలన్నారు. గట్ల మీద కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో విహెచ్ఎలు శివాబాయి, రాఘవ, కోటేశ్వరరావు నాయక్, అశోక్ తదితరులున్నారు.

విద్యార్థినులకు ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న మార్కొండారెడ్డి, డా రామకోటయ్య



ముగ్గులేస్తున్న విద్యార్థినులు

మాచర్ల: పట్టణంలో విద్యార్థినులను ప్రోత్సహిస్తూ వివిధ జూనియర్ కళాశాలల్లో మంగళవారం సంక్రాంతి ముందస్తు వేడుకలు పురస్కరించుకుని విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అందులో భాగంగా ముగ్గుల పోటీ కార్యక్రమాన్ని పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, నియోజక వర్గ ప్రభుత్వ వైద్యశాలల వర్కింగ్ ప్రెసిడెంట్ డా'' రామకోటయ్య, పెట్ సీఐ ప్రసాద్‌రెడ్డిలు ప్రారంభించారు. ప్రతిభా, పల్నాడు కళాశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు పఠాన్ నాగూర్‌వలి, ఎం లక్ష్మీనారాయణ, డా'' విజయ, శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి ఆలయ అధ్యక్షుడు చందోలు నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

మాంటిస్సోరీ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

పిడుగురాళ్ల: పట్టణంలోని మాంటిస్సోరీ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జబర్దస్త్ కమెడియన్ అప్పారావు, వినోద్ తదితలరులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం చిన్నారులతో ఆట పాటలాడి వారిని అలరపింజేశారు. అనంతరం చిన్నారులచే డైరెక్టర్ బాషా, ప్రిన్సిపల్ నిర్మల చిన్నారులకు సంక్రాంతి గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు

పిడుగురాళ్ల: పట్టణంలోని స్కాలర్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కుమ్మరి పాలెంగల స్కాలర్స్ ఏపీ క్యాంపస్‌లో విద్యార్థులకు సంక్రాంతి పర్వదినం సంబంధించిన సాంస్కృతిక కార్యక్రమాలు వారికి సంస్కృతి సాంప్రదాయాల గురించి కళాశాల చైర్మన్ పిచ్చిరెడ్డి తెలియజేశారు. అనంతరం చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్స్ జి. శ్రీనివాస రెడ్డి, ఎ. పకీర రెడ్డి, ఎం. జగదీశ్వర్‌రెడ్డి, దాచేపల్లి ప్రిన్సిపల్ రంగారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అ దేవిధంగా పట్టణంలోని నారాయణ విద్యా సంస్థలనందు విద్యార్థులకు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చిన్నారులు వివిధ రకాల దుస్తులతో ఆకట్టుకున్నారు.